సింగాడబస్తీ అధ్యక్షుడిగా..
జవ్వాది అనిల్‌కుమార్

సింగాడబస్తీ అధ్యక్షుడిగా ఎన్నికైన అనిల్ కుమార్‌ను సత్కరిస్తున్న బస్తీనేతలు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 2: బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని సింగాడబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా జవ్వాది అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా నామినేషన్ వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆదివారం బస్తీలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ నేతలు, కమిటీ సభ్యులు అనిల్‌కుమార్‌ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షులుగా గంగరాజు, సలహాదారులుగా ఎస్ఎన్.మూర్తి, సంయుక్త కార్యదర్శిగా సుధీర్ నియమితులయ్యారు. బస్తీలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కృషి చేస్తానని అధ్యక్షుడు అనిల్ కుమార్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ..దళిత వ్యతిరేకం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్ దళిత వ్యతిరేక బడ్జెట్ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు ఎస్సీలు, ఎస్టీలు,బీసీలకు రావాల్సిన నిధులను సైతం తీసుకురావడంలో పూర్తి విఫలం చెందారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో దళితులకు బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని,ప్రతి ఏడాది తగిన నిధుల కేటాయింపులు తగ్గుముఖం పడుతుందన్నారు. విద్య, ఉపాధి,పారిశ్రామిక రంగాల్లో దళితులను ప్రోత్సహించేందుకు నిధులు ఎంతో అవసరమని తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో దళితులకు ఎలాంటి మేలు జరిగే పరిస్థితి లేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకెల్లో తప్ప ఆచరణలో దళితుల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరుగలేదన్నారు. దళితుల విద్య, వైద్యం,ఉపాధి,తాగునీరు తదితర సౌకర్యాలకు సరిపడా నిధులను బడ్జెట్‌లో ప్రవేశపెట్టలేదని ఆరోపించారు.కేంద్రం స్పందించి బడ్జెట్‌ను సవరించి దళితులకు ఉపయోగపడే విధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు ముమ్మరం

- వందశాతం ఫీజు వసూళ్లకు ప్రణాళిక ...
- ట్రేడ్ లైసెన్స్ లేకుంటే దుకాణాలు సీజ్ ..
- 25శాతం జరిమానాతో 28లోపు చెల్లించాలి

జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 అధికారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలును ముమ్మరం చేశారు.ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లైసెన్స్ ఫీజు వసూలు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. వివిధ రకాలైన వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రేడ్ లైసెన్స్ తీసుకొని వారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

– హిమాయత్‌నగర్,ఫిబ్రవరి2:

ఆబిడ్స్‌లోని సర్కిల్-16 కార్యాలయం

- ఈ సర్కిల్ పరిధిలో సుమారు 12వేలకు పైగా చిన్నా,పెద్ద వ్యాపారాలు నడుస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.వీరిలో కొంతమంది వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారాలు చేసుకుంటున్నారు.లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసే వారిపై జరిమానాలు విధించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.
- లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా లైసెన్స్ జారీ చేసే విధంగా చర్యలు తీసుకుంటూనే మరో ప్రక్క లైసెన్స్ తీసుకోకుండా నిర్లక్ష్యం వహించే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం అవుతున్నారు.
- హిమాయత్‌నగర్, నారాయణగూడ,హైదర్‌గూడ, కింగ్‌కోఠి తదితర ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేసేందుకు ప్రత్యేకంగా బృందాలను రంగంలోకి దింపారు. వ్యాపార లావాదేవీలు నిర్వహించే ప్రతి సంస్థ జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.
- కొంత మంది వ్యాపారస్తులు,ప్రైవేట్ హాస్టల్స్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకుంటే అడ్రస్, లావాదేవీలు బయటకు తెలిసే అవకాశం ఉందని ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేస్తున్న వారిని సైతం గుర్తించి ఫీజు వసూలు చేస్తున్నారు.
- ఆయా వ్యాపార సంస్థల నుంచి ఇప్పటి వరకు రూ.1 కోటి 80 లక్షలను అధికారులు వసూలు చేశారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే.. దుకాణాలు సీజ్

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించని వ్యాపార సంస్థలు,ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకులు సకాలంలో చెల్లించి లైసెన్స్‌ను రెన్యూవల్ చేయించుకోవాలి. వ్యాపారస్తులు ఇంటి నెంబర్,పాన్‌కార్డు, ఆధా ర్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసిన వెంటనే లైసెన్స్ జారీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం.కొత్త వ్యాపారం చేసుకునే వారికి లైసెన్స్ మంజూరు చేయడంతో పాటు పాత వాటికి రెన్యూవల్ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.ట్రేడ్ లైసెన్స్ ఫీజులను చెల్లించని వ్యాపారులందరూ 25శాతం జరిమానాతో ఈ నెల 28లోపు చెల్లించాలి.ట్రేడ్ లైసెన్స్‌లేకుంటే దుకాణాలను సీజ్ చేస్తాం.

డాక్టర్ హేమలత , అంబర్‌పేట సర్కిల్-16 ఏఎంహెచ్‌వో

కాంగ్రెస్‌కు కాలం చెల్లినట్లే

-రాబోవు కాలమంతా మనదే
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు కార్తీక్ రెడ్డి తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: పేదల సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టి, మాయమాటలతో కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాజేంద్రనగర్ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్లకార్తీక్ రెడ్డి అన్నారు. ఆదివారం సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎండీ , జహీరోద్దిన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్యులకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయక పోవడంతో ఏడాదిలోనే ప్రజలకు దూరమైందని మండిపడ్డారు. ఎక్కువగా నిరుపేదలున్న ఈ మురికి వాడ ప్రాంతానికి, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పదేళ్లలోనే నీళ్లు, విద్యుత్, సీసీ రోడ్లు, కనీస వసతులు, అనేక సంక్షేమ పథకాలు అందాయని గుర్తుచేశారు.అభివృద్ధి పనులు చేయకుండా మాయమాటలు చెప్పే కాంగ్రెస్ నేతలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. వారు ఇచ్చిన హామీలకు, చేస్తున్న పనులకు పొంతన లేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కర్రుకాచి కాంగ్రెస్‌కు వాత పెట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎండీ ముఖీద్ చంద్ర, రహేమాన్, అమీర్, అప్రఫ్ నవాజ్, మగ్బుల్ గౌస్, షాజాబేగం, దౌలత్ పాషా, శకీల్, దస్తగిరి, మహబూబ్, తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు. సులేమాన్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బృందావన్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులను సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బృందావన్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. ప్రజలందరూ జీహెచ్ఎంసీ కార్మికులకు సహకరించాలన్నారు. కార్మికులు విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్కులు, గ్లౌజ్, షూ తదితర వాటిని ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాండు యాదవ్, రావుల భాస్కర్, కొవ్వకుల బాబు, టి.చిన్నా, శివరాజ్, ఏ.శంకర్‌రెడ్డి, అమర్, రమేష్‌రెడ్డి, ఉత్తం, జీహెచ్ఎంసీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సామేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో ఓపెన్ జిమ్

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్పీఆర్ హిల్స్ మైదానంలో జీహెచ్ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సందర్శించి వ్యాయామం చేశారు. జిమ్ పనులు తుది దశకు వచ్చాయని.. ఓపెన్ జిమ్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు, యువతీ యువకులతో పాటు ఆరోగ్య సంరక్షణకు మహిళలు, సీనియర్ సిటిజన్స్ ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. – జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 2

మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2: శారీక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలని అప్పుడే మనిషి అనుకున్నది సాధించగలుతాడని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభావతిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నడువండి నడిపించండి అనే లక్ష్యంతో క్లబ్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు తదితరులు

సరస్వతి పూజలు

వసంత పంచమిని పురస్కరించుకుని ఆదివారం రహ్మత్‌నగర్ శాఖ గ్రంథాలయంలో సరస్వతి మాత చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాస్, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్

10న శ్రీకృష్ణానగర్ మున్నూరుకాపు సంఘానికి ఎన్నికలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 2 : యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్ మున్నూరుకాపు సంఘానికి ఎన్నికలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతామని ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు. 4న నామినేషన్ పత్రాల పరిశీలన, 5న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఈనెల 10న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదేరోజు సాయంత్రం ఫలితాలను వెల్లడిస్తామని కన్వీనర్ మంగళారపు లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెరుక రవి, ప్రధాన కార్యదర్శులు వాసాల తిరుపతి, సతీష్, కమిటీ సభ్యులు పేరుక పెద్ద బాలయ్య, తూముల బాలయ్య, వాసాల రాజు, మాజీ అధ్యక్షులు కోల శివకుమార్, ప్రతినిధులు పంతం రాజయ్య, జంగిటి నాగార్జున, ములుగు రవీందర్, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్‌లోని పరివర్తన లా ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 2: కులాంతర వివాహం చేసుకున్న దళిత యువకుడు వడ్ల కొండ కృష్ణను హత్య చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ కాన్ఫడరేషన్ జాతీయ అధ్యక్షుడు వి.ఎల్.రాజు,దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం హిమాయత్‌నగర్‌లోని పరివర్తన లా ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కుల వివక్షతోనే కృష్ణ భార్య భార్గవి కుటుంబ సభ్యులు, బంధువులే సూర్యాపేట శివారులో అతి కిరాతకంగా కృష్ణను హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మృతుడు కృష్ణ కుటుంబ సభ్యులకు సైతం ప్రాణహాని ఉందని ప్రభుత్వం రక్షణ కల్పించి, వారి కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియాను డిమాండ్ చేశారు.
కృష్ణ హత్య వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు.ఈ సమావేశంలో డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కో- ఆర్డినేటర్ గణేష్, ఐహెచ్ఆర్‌సీ ప్రధాన కార్యదర్శి ఎం.రఘు నందన్, మహిళా విభాగం అధ్యక్షురాలు శివరాణి,ప్రతినిధి సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, ఫిబ్రవరి 2: పేదల విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్ సెంయిట్ పాయిస్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యాపార దృక్పథంతో కాకుండా పేదలను దృష్టిలో పెట్టుకొని విద్యాబోధనకు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించి సాంస్కృతిక, క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లిండా జెరాల్డ్, కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్య, కె.మార్గరెట్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ చిరంజీవి, బీఆర్ఎస్ నాయకుడు రావుల పాటి మోజస్, మేజర్ జయసుధ, నందిని అగసార, నక్షత్ర, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో .. గంగిడి పుల్లారెడ్డి సత్తా

ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ కృష్ణా రివర్ క్రానింగ్ స్విమ్మింగ్ పోటీలను ఫిబ్రవరి 2న నిర్వహించారు. ఈ పోటీల్లో అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన గంగిడి పుల్లారెడ్డి పాల్గొని సత్తాచాటారు. విజయవాడలోని దుర్గాఘాట్ నుంచి ఫుడ్ సిటీ వరకు 1.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 33 సెకండ్స్‌లో స్విమ్మింగ్ పూర్తి చేసి రికార్డు సృష్టించారు. 51-60 సంవత్సరాల క్యాటగిరిలో ఆయన పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేశ్వరరావు, యుగేందర్, ఎన్.రాజులు సర్టిఫికెట్, ట్రోఫీని అందజేసి అభినందించారు. – మైలార్‌దేవ్‌పల్లి

గ్రామాభివృద్ధి తోనే వికసిత్ భారత్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 2: గ్రామాభివృద్ధి ద్వారానే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. దేశం పురోగాభివృద్ధి సాధించాలంటే విద్య ఎంతో ముఖ్యమని చెప్పారు. బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యూ) దక్షిణ భారత పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో మహామహాన్ మాలవ్య మిషన్-బీహెచ్‌యూ పూర్వ విద్యార్థుల సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మనోజ్ సిన్హా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీ ద్వారా ఉన్నత విద్యలోని అన్ని విభాగాలు ఒకే గొడుగు కిందికి వచ్చాయని చెప్పారు. సమాజ అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్రీయ పరిశోధన సంస్థలు కృషి చేయాలని సూచించారు. దేశ ఆర్థిక స్థితి పెరగాలంటే సైన్స్ అభివృద్ధి జరగాలని అన్నారు.

కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు కల్పించాలి

కాటేదాన్‌లోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి సౌకర్యాలు కల్పించాలంటూ నినాదాలు చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: క్రీడాకారులకు ఉపయోగపడాల్సిన కాటేదాన్ ఇండోర్ స్టేడియంలో సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారిందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్ అన్నారు. మండల నాయకులు పి.సి.కె.భాస్కర్ అధ్యక్షతన కాటేదాన్‌లో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని పర్యటించి సందర్శించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో రూ. 24.61 కోట్లతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించారన్నారు. 2023లో దీనిని ప్రారంభించి వదిలేశారు. ప్రభుత్వం ఇండోర్ స్టేడియంలో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో నిరుపయోగంగా ఉందన్నారు. స్విమింగ్ పూల్ మొత్తం ఎండిపోయి అందులో చెత్తాచెదారాలతో నిండిపోయిందన్నారు. విద్యార్థులు, యువకులకు ఈ స్టేడియంలో క్రీడలు ఆడుకునేందుకు ఉపయోగకరంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని కోరారు లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు జి.ఎం.కురుమయ్య, జి.ఎం.గట్టయ్య, నర్సింహ, లక్ష్మణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ: *యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, నవ్య సాహితీ సమితి, ఐఐఎంసీ కళాశాల సంయుక్తాధ్వర్యంలో కళాశాలలో తెలుగు వెలుగు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి శతజయంతి సాహితీ మూర్తులు పుస్తకాన్ని ఆవిష్కరించారు –ఖైరతాబాద్.*

ముదిరాజ్‌లను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పరి నారాయణ ముదిరాజ్ అరుణ్ కుమార్,

ఖైరతాబాద్, ఫిబ్రవరి 2 : ముదిరాజ్‌లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ముదిరాజ్ సంఘం నేతలు ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘం ప్రతినిధి ఉప్పరి నారాయణ ముదిరాజ్ అని అన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగినా గత ఎన్నికల్లో తమకు సరైన ప్రాధాన్యత లభించలేదన్నారు. ముదిరాజ్‌లను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుచ్చేందుకు గత నెల 18న గన్ పార్కు వద్ద ప్రారంభమైన ముదిరాజ్ చైతన్య బస్సు యాత్ర రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో పర్యటించిందని, సిద్దిపేటలో ముగిసిందన్నారు. ముదిరాజ్‌లను ఇప్పటికైనా బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని, కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్, కోట్ల పుష్పలత, లావణ్య, రేణుక, కృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ప్రోత్సహించడం అభినందనీయం

బొల్లారం, ఫిబ్రవరి 2: అనాథ పిల్లలను చేరదీసి ఉన్నత విద్యతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తున్న తారా ఫౌండేషన్ కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ అన్నారు. బోయిన్‌పల్లిలోని అనాథాశ్రమంలో 25వ ఫ్రీస్టైహుడ్ వేడుకలకు ముఖ్య అతిథులుగా సినీ ప్రముఖులు మురళీ మోహన్, భానుచందర్, చిట్టిబాబు హాజరయ్యారు. ఆశ్రమానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ఈనెల 5 నుంచి 17వరకు మలేషియాలో జరుగనున్న అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సెయిలింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ఇంటర్నేషనల్ స్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన సీసీరోడ్డు పనులు చేపట్టాలి

కంటోన్మెంట్, ఫిబ్రవరి 2: బోయిన్‌పల్లి తోకట్ట విలేజ్‌లోని గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో చేపట్టాల్సిన సీసీరోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని బోర్డు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను బస్తీకి చెందిన ఎనముల విజయ్, మధుతో పాటు స్థానికులు కోరారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒకటో వార్డు నుంచి ఆరో వార్డు వరకు కనిష్టివిటీ, గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో సీసీరోడ్డు నిర్మాణం కోసం సుమారు రూ.50లక్షల నిధులను 2023 మే 10న జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మంజూరు చేశారని తెలిపారు. రెండేళ్లు కావొస్తున్నా పనులకు సంబంధించి ఊసే లేదన్నారు. శ్మశానవాటికకు వచ్చే సందర్భంలో ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికంగా దారి సరిగ్గా లేకపోవడంతో అనేక ఇక్కట్లకు గురికావాల్సి వస్తుందన్నారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలకే దిక్కులేకపోవడం శోచనీయమన్నారు. ప్రధానంగా రోడ్లు మరమ్మతులు, నూతన రోడ్లు వేయకుండా తోకట్ట విలేజ్‌పై అధికారులు శీతకన్ను వేస్తున్నారని మండిపడ్డారు. బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నా ఇక్కడ మాత్రం పనులు చేపట్టక పోవడంలో మర్మమేమిటని ప్రశ్నించారు. అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు.

ప్రయోజనం లేని కేంద్రబడ్జెట్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 2: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజానికానికి ఎలాంటి ఉపయోగకరంగా లేదని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమకు కొమ్ముకాసే వారికే బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా ఎన్నో వెసులుబాటు కల్పించిందన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు వరాలు కురిపించి ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిదది మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు తీసుకురావడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు.

బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష..



*కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపుతూ నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం టీపీసీసీ అధ్వర్యంలో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. –జూబ్లీహిల్స్